సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



రూ.కోట్లతో ఆలయాల అభివృద్ధి
జగన్ సర్కార్ ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించింది. రూ. కోట్లు ఖర్చు చేసి సౌకర్యాలు మెరుగు పరుస్తోంది. ఫలితంగా భక్తుల రద్దీ పెరుగుతోంది. 8లో



టమాట కిలో రూ.17
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/ 13.6°
జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు 'ఇంటాక్' చైర్మన్ రాక

అనంతపురం కల్చరల్: ఇంటాక్ (అఖిల భారత కళలు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ ట్రస్టు) చైర్మన్ ఎల్‌కే గుప్తా గురువారం జిల్లాకు రానున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకుమార్, కవి అశ్వర్థ రెడ్డి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. ప్రసిద్ధ లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయ దర్శనానంతరం అనంతపురం చేరుకుంటారన్నారు. నగరంలోని రోటరీ క్లబ్‌లో సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. లేపాక్షి ఆలయానికి 'యునెస్కో' గుర్తింపు సాధనకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు హఠాన్మరణం

- గుండెపోటుతో కదిరి ఆర్టీసీ బస్టాండులో కుప్పకూలిన వైనం


మృతిచెందిన మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు


ఎంఎస్ ప్రభాకర్‌రావు (ఫైల్)


కదిరి టౌన్: మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎంఎస్ ప్రభాకర్‌రావు (60) హఠాన్మరణం చెందారు. బుధవారం గుండెపోటుతో కదిరి ఆర్టీసీ బస్టాండులో కుప్పకూలి ప్రాణం వదిలారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఆయన్ను బుధవారమే పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) కార్యదర్శిగా బదిలీ చేశారు. అయితే బుధవారం కోర్టు పనిమీద మడకశిర నుంచి రాయచోటికి వెళుతూ కదిరి బస్టాండ్‌లో దిగారు. ఉన్నఫలంగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలారు. స్థానికులు వెంటనే ఆయన్ను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభాకర్‌రావు స్వస్థలం హిందూపురం. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15లోపు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు

నల్లమాడ: రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగుచేసిన పంటలకు ఈనెల 15వ తేదీలోపు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ సుబ్బారావు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని నల్లమాడ, చారుపల్లి గ్రామాల పరిధిలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రైతు భరోసా సిబ్బంది సైతం అలసత్వం వహించకుండా ఈ-క్రాప్, ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి సుమతి, రైతు భరోసా సహాయకులు వినోద్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

'వన్‌స్టాప్'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రశాంతి నిలయం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ (సఖి) సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి లక్ష్మీ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, పారాలీగల్ పర్సనల్/లాయర్, పారామెడికల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సెలర్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు ఒక్కొక్కటి, బహుళ ప్రయోజన సిబ్బంది/కుక్ మూడు పోస్టులు, కేస్ వర్కర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులు ఫిబ్రవరి 7 నుంచి 15వ తేదీ వరకు సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. అర్హతలు, జీతభత్యాలు తదితర వివరాల కోసం https://srisathyasai.ap.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

18న సిద్ధం


సభా వేదికను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తదితరులు

- హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి
- సభా స్థలి వద్ద శరవేగంగా ఏర్పాట్లు
- రాయలసీమ జిల్లాల నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు
- చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి, తలశిల రఘురాం, ప్రజాప్రతినిధులు

రాప్తాడు: ఎన్నికల కదనరంగంలో వైఎస్సార్ సీపీ దూసుకుపోతోంది. శ్రేణులను మహా సంగ్రామానికి 'సిద్ధం' చేస్తోంది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమరశంఖం పూరించారు. ఈ క్రమంలోనే రాయలసీమ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ముఖ్యమంత్రి ఈ నెల 18న రాప్తాడు రానున్నారు. స్థానిక ఆటోనగర్ వద్ద నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

50 నియోజకవర్గాల నుంచి..
ఇప్పటికే నిర్వహించిన సిద్ధం సభలకు కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది తరలివచ్చారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాప్తాడు 'సిద్ధం' సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. తరలివచ్చే శ్రేణులకు ఎక్కడా చిన్న ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రాయలసీమలోని 50 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో పాటు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు సిద్ధం సభకు హాజరు కానుండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 19కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. సభావేదిక వెనుక భాగంలో సీఎం హెలిప్యాడ్ పనులు చేపడుతున్నారు. సభావేదిక ముందు భాగంలో సీఎం వైఎస్ జగన్ కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి అభివాదం చేయడానికి వీలుగా సుమారు కిలో మీటరు విస్తీర్ణంతో ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి
'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా ఇన్చార్జ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. సభా వేదిక వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. అనంతపురం ఏఆర్, రూరల్ డీఎస్పీలు మునిరాజు, వెంకటశివారెడ్డితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సమీక్షించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీవీపీ పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సీఎం సభాస్థలి, హెలీప్యాడ్, ట్రాఫిక్ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంటు సమన్వయ కర్త శాంతమ్మ, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివా రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాయదుర్గం, మడకశిర సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, ఈర లక్కప్ప, అనంతపురం, చిత్తూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు బోయ గిరిజమ్మ, శ్రీనివాసులు, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, తదితరులు పాల్గొన్నారు.




సభా స్థలి ఏర్పాట్లలో నిమగ్నమైన కార్మికులు, పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలగకుండా ప్రాంగణాన్ని చదును చేస్తున్న దృశ్యం, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ సీఎం నడిచి వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న ర్యాంప్

ఎన్నికలకు సన్నద్ధం

- ముందస్తు ఏర్పాట్లలో యంత్రాంగం
- ఇప్పటికే బదిలీలు పూర్తి చేసిన అధికారులు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశాలు
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు


ధర్మవరంలో ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



జిల్లా ఓటర్లు	13,92,992
మహిళా ఓటర్లు	6,97,119
పురుష ఓటర్లు	694,446
సర్వీస్ ఓటర్లు	1,364
పోలింగ్ కేంద్రాలు	561
ఎన్నికల అధికారులు	9,561
మొత్తం రూట్లు	195

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఇప్పటికే బదిలీలు పూర్తి చేశారు. అలాగే ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సహకారం కోరుతున్నారు. నూతన ఓటరు నమోదు నుంచి తుది జాబితా మార్పులు, చేర్పుల దాకా అన్నీ పార్టీల నాయకులకు విశదీకరిస్తున్నారు. అలాగే అధికారులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు.

9న శిక్షణ కార్యక్రమం..
ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలోని పలువురు అధికారులను బదిలీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన వారికి రెండు రోజుల క్రితమే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో ఒక ఆర్డీఓ, 31 మంది తహసీల్దార్లు, 17 మంది ఎంపీడీఓలు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు. వీరందరికీ ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేసేందుకు 9వ తేదీన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

జిల్లాకు 1.40 లక్షల ఎపిక్ కార్డులు..
ఎన్నికల కమిషన్ జిల్లాకు 1.40 లక్షల ఎపిక్ కార్డులను విడతల వారీగా పంపుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 18 వేల కార్డులు పోస్టల్ శాఖ ద్వారా పంపింది. మిగతావీ పంపేందుకు చర్యలు తీసుకుంది. ఇక జిల్లాలో జనవరి 22వ తేదీన విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో సర్వీస్ ఓటర్లతో కలిపి 13,92,992 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో 6,94,446 మంది పురుషులు, 6,97,119 మంది మహిళలు, 63 మంది ఇతరులు, 1,364 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో కొత్తగా ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా 91,647 మంది దరఖాస్తు చేసుకున్నారు.

1,561 పోలింగ్ కేంద్రాలు..
జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓలు కలిపి మొత్తం ఆరుగురిని నియమించనున్నారు. జిల్లాను 195 రూట్లుగా విభజించారు. ఒక రూట్‌కు ఒక అధికారి బాధ్యతలు అప్పగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు..
పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యూతో పాటు ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎన్నికల కమిషన్‌కు ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న 80 ఏళ్ల పైబడినవారికి ఇంటివద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించనున్నారు.

ప్రత్యేక సమీక్షలు..
ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా ఆర్‌ఓ పుస్తకాలను తయారు చేశారు. ఈ మేరకు ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న అధికారులకు వాటిని పంపిణీ చేయడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్డీఓ స్థాయిలో ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇక జిల్లా ఎన్నికల ప్రత్యేకాధికారి, రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, ఆధ్వర్యంలో పలు మార్లు సమీక్షలు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం



సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రాజకీయ పార్టీలతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. పోలీస్ శాఖ సహకారంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 386 టీచర్ పోస్టులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ పోస్టుల అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. డీఎస్సీకి షెడ్యూల్ విడుదల చేసింది. బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ షెడ్యూల్ ప్రకటించారు. మార్చి 15 నుంచి 30 వరకు రెండు విడతలగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7న ఫలితాలు వెల్లడిస్తారు. ఈనెల 12 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్చి 5 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోస్టులు భర్తీ చేయనున్నారు. జిల్లాలో దాదాపు 386 పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 164, టీజీటీ పోస్టులు 115 ఉన్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. టెట్ ఈనెల 27 నుంచి మార్చి 9 వరకు జరగనున్నాయి. హాల్ టికెట్లు ఈనెల 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

డీఈఓ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం..
డీఎస్సీ, టెట్‌కు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అభ్యర్థులకు నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉంది. పలువురు నిరుద్యోగ అభ్యర్థులు డీఈఓ కార్యాలయంలోని సంబంధిత విభాగం సిబ్బందిని కలవగా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తమకేమీ తెలియదన్నట్లు మాట్లాడటాన్ని నిరుద్యోగ అభ్యర్థులు తప్పుబడుతున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

15న ఉద్యోగ మేళా



పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 15న చిత్తూరులో రీజనల్ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటన తెలిపారు. చిత్తూరు విజ్ఞాన్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ మేళాలో 100 కంపెనీలకుపైగా పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారు మన రాష్ట్రంతో పాటు చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు బయోడేటాలతో పాటు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 8374421195, 8142509017 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన.. జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్తగా జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ఆయా సచివాలయాల్లో చేయాల్సి ఉందన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన వారు జిల్లాలో 34,353 మంది ఉండగా, ఇప్పటి వరకూ 5,285 మంది పట్టాలు రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గురువారం నాటికి కనీసం 9 వేల ఇంటి పట్టాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. అలాగే కుల గణనపై అధికారులంతా దృష్టి సారించాలన్నారు. సోమందేపల్లి, గాండ్లపెంట, నల్లమాడ, హిందూపురం అర్బన్, పుట్టపర్తి అర్బన్ మండలాల్లో కులగణన సర్వే సరిగా సాగడంలేదని, వెంటనే వేగవంతం చేయాలన్నారు.

పార్థసారథికి పచ్చ పోటు!

- పెనుకొండ టీడీపీలో వర్గ విభేదాలు
- 'జయహో బీసీ'కి మాజీ ఎంపీ నిమ్మల, సవితమ్మ గైర్హాజరు

గోరంట్ల: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సొంత పార్టీ నేతలే ఆయనకు మద్దతు పలకడం లేదు. ఇప్పటికే పెనుకొండలో తిరుగుబాటు చేసిన సవితమ్మ పార్టీ కార్యక్రమాలు కూడా వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈ సారి టికెట్ తనదేనంటూ హడావుడి చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బీకే పార్థసారథి ఒంటరిగా మిగిలిపోయారు. కానీ పట్టునిలుపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో 'జయహో బీసీ' కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించాలని, తద్వారా పెనుకొండలో తనపట్టు చూపాలని భావించారు. అయితే బుధవారం గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమానికి టీడీపీ బీసీ నేతలు చాలా మంది దూరంగా ఉన్నారు. ముఖ్యనేతలైన మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మతో పాటు సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాలకు చెందిన బీసీ నాయకులు చాలా మంది గైర్హాజరయ్యారు. దీంతో టీడీపీలో మరోసారి వర్గ విభేదాలు తెరపైకి వచ్చినట్లు ఆ పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. 2014లో టీడీపీ అధికారంలో ఉండగా, పెనుకొండ ఎమ్మెల్యేగా పార్థసారథి, హిందూపురం ఎంపీగా నిమ్మల కిష్టప్ప ఉండేవారు. అప్పుడే వారి మధ్య వర్గ విభేదాలు పొడచూపాయి. అప్పట్లో పార్టీ కార్యక్రమాలతో పాటు అధికారిక కార్యక్రమాల్లోనూ ఇరువురు నేతలు ఎడముఖం, పెడముఖంగా ఉండేవారు. దీంతో పార్టీ కేడర్ కూడా రెండుగా చీలిపోయింది. ఆధిపత్య ధోరణిలో ఒక వర్గం, మరోవర్గంపై దాడులకు సైతం తెగబడింది. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతుండగా, ఇక పెనుకొండలో టీడీపీ గెలవడం కలేనని బుధవారం జరిగిన జయహో బీసీ సభలో కార్యకర్తలు చర్చించుకున్నారు.

ఎనిమిదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు

- తప్పిపోయిన బాలిక అప్పగింత


బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సభ్యులు

అనంతపురం సిటీ: ఊహ తెలియని వయసులో తప్పిపోయిన ఓ చిన్నారిని ఎనిమిదేళ్ల తర్వాత సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు అధికారులు చేర్చారు. ఇక లేదు.. రాదు అనుకున్న బిడ్డ తమ చెంతకు చేరుకోవడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన అంజినమ్మ, శ్రీరాముడు దంపతుల కుమార్తె సాయి లీల తల్లిదండ్రులు మందలించడంతో 2017, డిసెంబర్ 8న ఇల్లు వదిలి బసంపల్లికి చేరుకుంది. అక్కడి నుంచి ఎక్కడికి పోవాలో తెలియక ఏడుస్తుండడంతో గమనించిన గ్రామస్తులు అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించారు. అదే రోజు సీడబ్ల్యూసీ ఆదేశాలతో అనంతపురంలోని బాలసదనానికి బాలికను చేర్చారు. తన ఊరు, తల్లిదండ్రుల గురించి చెప్పలేని స్థితిలో ఉన్న ఆ చిన్నారిని కేజీబీవీలో చేర్పించి విద్యాబుద్ధులు చెప్పించారు. ఈ క్రమంలో ఇటీవల సాయిలీలను సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి కలసి ఆరా తీస్తే తమది కొత్తచెరువు అని తెలిపింది. అన్నం అడుక్కునేందుకు ఇంటి వచ్చిన తాను దారి తప్పినట్లుగా వివరించింది. దీంతో రామలక్ష్మి ఆదేశాలతో ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, అనంతపురానికి చెందిన ఔట్ రీచర్ రమాదేవి రంగంలో దిగి బాలిక తెలిపిన వివరాల మేరకు తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయితే వారు ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేస్తుంటారని తెలుసుకున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత కనుముక్కలలో వారి జాడ కనుగొని, బుధవారం అనంతపురానికి పిలుచుకొచ్చారు. బాలిక తెలిపిన వివరాలు, తలిదండ్రులు చెప్పిన వివరాలు సరిపోల్చుకుని కౌన్సెలింగ్ అనంతరం సాయిలీలను అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సభ్యులు లక్ష్మీ కామేశ్వరి, ఓబుళపతి, డీఈఓ అబ్దుల్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ సమితి ఔట్ రీచ్ వర్కర్ రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కోడూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

చిలమత్తూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీశారు. శెట్టిపల్లి, పెద్దనపల్లి, కోడూరు, థామస్ మన్రో తోపు, టేకులోడు సెక్టారు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సౌకర్యాల ఏర్పాటుపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తహసీల్దార్ భాగ్యలతకు సూచించారు.

కలెక్టరేట్ ఏఓగా రామాంజనేయరెడ్డి

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ)గా రామాంజనేయరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తచెరువు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటనారాయణ నంద్యాల జిల్లా ఏఓగా బదిలీపై వెళ్లారు.

యువకుడి దుర్మరణం



హర్షవర్ధన్ (ఫైల్)

బత్తలపల్లి: ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన నాగభూషణ, శివమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో నాగభూషణ మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులతో కుటుంబానికి పెద్ద కుమారుడు హర్షవర్ధన్(20) అండగా నిలిచాడు. బుధవారం సాయంత్రం బత్తలపల్లికి వచ్చిన హర్షవర్ధన్‌కు అమ్మ చెల్లెలు (పిన్నమ్మ) ఈశ్వరమ్మ కనిపించింది. ఆమె చేతిలో కేక్‌ను గమనించిన హర్షవర్ధన్ ఎందుకంటూ ఆరా తీశాడు. దీంతో తన కుమారుడి పుట్టిన రోజు విషయం ఆమె తెలిపి అమ్మను పిలుచుకుని రమ్మని కోరింది. దీంతో శివమ్మను పిలుచుకుని వచ్చేందుకు రాత్రి ఈదుల ముష్టూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన హర్షవర్ధన్... రాఘవంపల్లి బస్‌స్టాప్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, చిట్టిబాల ఓబిరెడ్డి తదితరులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రూ.కోట్లతో ఆలయాల అభివృద్ధి

- దేవుడి మాన్యం పరిరక్షణకు జగన్ సర్కార్ చర్యలు
- జిల్లాలోని 1,097 ప్రముఖ ఆలయాల ద్వారా రూ.10 కోట్లకు పైగా ఆదాయం



జ్యోతుల ఉత్సవం జరిగే భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం



మాన్యం భూమి రక్షణలో భాగంగా మొక్కలు నాటిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఆలయాల అభివృద్ధికి జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఓ వైపు అర్చకుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేస్తూనే మరో వైపు ఆలయ మాన్యం భూములను రక్షిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే నూతన ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.3.5కోట్లు విడుదల చేశారు. దీంతో ఆలయాల్లో సౌకర్యాలు మెరుగు పడడంతో భక్తుల సంఖ్య నానాటికీ పెరిగింది. ఆలయాలు భక్తుల సందడితో కళకళలాడుతున్నాయి.

రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయాల అభివృద్ధి పుంజుకుంది. క్యూలైన్ల ఏర్పాటు, ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచడం, అవసరమైన మరమ్మతులు, పార్కుల ఏర్పాటు, విద్యుద్ధీకరణ, చక్కటి వసతి, మొక్కల పెంపకం, షెల్టర్ల ఏర్పాటుతో ఆలయాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. జిల్లాలోని మూడు ఆలయాలను రూ.3 కోట్లు వెచ్చించి పునరిద్ధరిస్తున్నారు. ఇందులో దేవదాయశాఖ నుంచి 80 శాతం నిధులు మంజూరు కాగా, ప్రజల వాటా 20 శాతం ఉంటోంది. గత ఏడాది వచ్చిన వరదలకు దెబ్బతిన్న కదిరి మండలంలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో పెద్దఎత్తున మరమ్మతులు చేపట్టారు. ఇందు కోసం రూ.1.25 కోట్లు వెచ్చిస్తున్నారు. గోరంట్ల మండలం మందలపల్లిలోని శ్రీరాముడి ఆలయానికి రూ.1.25 కోట్లు, కరావులపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50 లక్షలు, రాగిమేకలపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని రూ.50 లక్షలతో నిర్మాణాలు చేపట్టారు. రాగిమేకలపల్లి అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఈ నెల రెండో వారంలో ప్రారంభించేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ప్రముఖ ఆలయాలకు రద్దీ..

జిల్లాలోని ప్రముఖ ఆలయాలను సందర్శించే భక్తుల సంఖ్య ఒకప్పుడు వేలల్లో ఉండగా... ప్రస్తుతం అది లక్షలకు చేరుకుంది. బ్రహ్మోత్సవాల సమయంలో ఇసుక వేస్తే రాలనంతగా భక్తజనం తరలివస్తుండడమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం సౌకర్యాలు మెరుగు పరచడంతో కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి, భక్తరహళ్లిలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు గతంలో కన్నా ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ ఆలయాల ద్వారా దేవదాయ శాఖకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. హుండీ, తలనీలాలు, కొబ్బరి కాయల విక్రయం, షాపుల అద్దెలు, తినుబండారాల విక్రయాలు తదితర వాటిలో పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. వీటితో పాటు జిల్లాలో 1,097 ప్రముఖ ఆలయాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ సందర్శించడంతో దేశ వ్యాప్తంగా అందరి దృష్టి ఈ ఆలయంపై పడింది. దీంతో పాటు ధర్మవరంలోని దుర్గా అమ్మవారు, చెన్నకేశవస్వామి, పాండురంగస్వామి, ఎరదొడ్డి గంగమ్మ, పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, పేట వేంకటరమణ స్వామి, సూగూరు ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, హేమావతి తదితర ముఖ్యమైన ఆలయాల్లో రోజూ భక్తుల రద్దీ నెలకొంటోంది.

రూ.10 కోట్లకు పైగా ఆదాయం..

దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల ద్వారా ఈ ఏడాది సుమారు రూ.10 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఒక్క హుండీల ద్వారానే రూ.7.5 కోట్లు, తలనీలాలు, టెంకాయల విక్రయాలు, షాపుల అద్దెలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2.5 కోట్లు, వసతి గదుల ద్వారా రూ.50 లక్షలు, ఉత్సవాల సమయంలో అదనంగా రూ.1.5 కోట్లు, భూములు లీజుకు ఇవ్వడం ద్వారా సుమారు రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. చాలా ఆలయాల్లో నిత్య పూజల్లో భక్తులు విరివిగా పాల్గొంటున్నారు. ఇక వారాంతపు పూజలకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. జిల్లాలోని ఆలయాలకు సుమారు 10,470 ఎకరాల మాన్యం భూమి ఉంది. చాలా వరకూ అన్యాక్రాంతమైన ఈ భూముల పరిరక్షణకు జగన్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుంది. జగనన్న భూ సర్వేలో భాగంగా ఆలయ మాన్యం భూములను గుర్తించిన అధికారులు వాటి సంరక్షణకు చర్యలు తీసుకున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం



భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. వసతితో పాటు ప్రయాణ మార్గాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చొరవ తీసుకున్నాం. ఆలయ భూముల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో భూములను సమగ్రంగా రీ సర్వే చేయిస్తున్నాం. మాన్యం భూముల్లో పండ్ల మొక్కల పెంపకం చేపట్టాం.
– మల్లికార్జునరెడ్డి, దేవదాయశాఖ జిల్లా అధికారి

కలుషిత నీరు తాగి 25 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

రామగిరి: కలుషిత నీరు తాగి 25 గొర్రెలు మృతి చెందాయి. రామగిరి మండలం ఎంసీపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ కిష్టప్ప, నారాయణ తమ గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను బుధవారం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి మేపునకు తోలుకెళ్లారు. మధ్యాహ్నం తాగు నీటి కోసం సమీపంలోని రైతు పొలంలోకి గొర్రెలను వదిలారు. అయితే అప్పటికే క్రిమి సంహారక మందును కలిపిన నీటిని తాగి 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 15 గొర్రెలు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాయి. విషయం తెలుసుకున్న పశువైద్యుడు డాక్టర్ మౌలాలీ, సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, సిద్ధన్న అక్కడకు చేరుకుని పరిశీలించారు. రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఈ సందర్భంగా బాధిత కాపరులు వాపోయారు.

సేవాలాల్ ట్రస్ట్ పేరిట అక్రమ వసూళ్లు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని కొందరు అక్రమ వసూళ్లకు తెరతీశారు. దీంతో అప్రమత్తమైన ట్రస్ట్ అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, రవీంద్రనాయక్ బుధవారం మాట్లాడుతూ... ఎవరూ విరాళాలు ఇవ్వబోరాదని విజ్ఞప్తి చేశారు. కొందరు ట్రస్ట్ పేరు చెప్పి భారీగా డబ్బు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విరాళాలు ఇవ్వదలుచుకుంటే ట్రస్ట్ కోశాధికారి బాలానాయక్ సెల్‌ఫోన్ 99306 56698కు సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా విరాళాలు ఇవ్వాలనుకునే వారు గుత్తిలోని స్టేట్ బ్యాంకు శాఖలో ఉన్న ట్రస్ట్ ఖాతా నంబర్ 33167788064, ఐఎఫ్ఎస్‌సీ కోడ్-ఎస్‌బీఐఎన్ 0000976కు పంపాలని కోరారు. విరాళం అందించిన అనంతరం కోశాధికారి నుంచి రసీదు తప్పని సరిగా పొందాలన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాలను పరిశీలించిన కలెక్టర్
- మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశం



ఎంజీఎం స్కూల్ వద్ద ఈవీఎంల భద్రతకు అనువుగా ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

ధర్మవరం రూరల్/మడకశిర/హిందూపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా యంత్రాంగం ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ధర్మవరం, మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో ఈవీఎంలు భద్రపరిచేందుకు, అలాగే కౌంటింగ్ కేంద్రాలకు గుర్తించిన భవనాలను కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం పరిశీలించారు. తొలుత ధర్మవరం వెళ్లిన కలెక్టర్.. గుట్టకిందపల్లిలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈవీఎంల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు కోసం సౌకర్యాలు ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల క్లెయిమ్‌ల పరిష్కారంపై రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. ఎర్రగుంట, మారుతీనగర్‌లోని సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకటశివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ రమేష్ ఉన్నారు.

సౌకర్యాలపై ఆరా

పోలింగ్ కేంద్రాల కోసం గుర్తించిన భవనాల వద్ద సౌకర్యాలపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆరా తీశారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి మడకశిరలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలతో పాటు హిందూపురం ఎంజీఎం హైస్కూల్ నూతన భవనాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. తాగునీరు, మరుగుదొడ్లు, రోడ్డు సౌకర్యంపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పశువుల కంటైనర్ బోల్తా...







మృతులు శ్రీనివాసరావు, ఈశ్వరరావు(ఫైల్), ఘటనాస్థలంలో పశువుల కళేబరాలు

- ఇద్దరి దుర్మరణం
- 26 ఎద్దులు, 9 ఆవుల మృతి
- అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో ఘోరం

పెద్దవడుగూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ కంటైనర్ బోల్తా పడింది. దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. కంటైనర్‌లోని 26 ఎద్దులు, 9 ఆవులూ మృతి చెందాయి. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కాశేపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. హైదరాబాదులో పశువులను కొనుగోలు చేసిన ఓ ముఠా వాటిని రహస్యంగా కంటైనర్‌లో బెంగళూరు తరలిస్తున్నారు. సుమారు 40 పశువులతో వెళ్తున్న కంటైనర్ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో అదుపుతప్పి సిమెంటు దిమ్మెను ఢీ కొంది. రోడ్డు పక్కనే బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన 26 ఎద్దులు, 9 ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 4 ఆవులకు తీవ్రగాయాలయ్యాయి. కంటైనర్ వెనుక భాగంలో జీవాలతో పాటే ఉన్న శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం పంగవానిపేటకు చెందిన శ్రీనివాసరావు (52), విశాఖపట్నం జిల్లా దేవరానికి చెందిన ఈశ్వరరావు (46) కూడా దుర్మరణం పాలయ్యారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో జీవాలు మృతి చెందడంతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది.

మిన్నంటిన మూగరోదన..

కంటైనర్ బోల్తా పడడంతో కిందపడిన మూగ జీవాలు అంబా అంబా అంటూ పెద్దపెట్టున అరుపులు లంకించుకున్నాయి. దీంతో సమీపంలోని పెట్రోల్ బంకు, టోల్ గేట్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. యాడికి సర్కిల్ సీఐ రోషన్, పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో కళేబరాలను తొలగించారు. వాటి కింద ఇరుక్కున్న శ్రీనివాసరావు, ఈశ్వరరావు మృతదేహాలను అతి కష్టం మీద బయటకు తీశారు. పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పశువుల కళేబరాలను ఘటనా స్థలికి సమీపంలోనే ఖననం చేశారు. గాయపడిన పశువులు అరుస్తూ ఉండడం చూసిన పలువురు కంటతడి పెట్టారు.

డ్రైవర్ అజాగ్రత్తతోనే..

డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కంటైనర్ బోల్తా పడగానే డ్రైవర్, క్లీనర్లు పరారైనట్లు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో మృతులు సాధారణ కూలీలని తెలిసిందని పేర్కొన్నారు. వారి బంధువులకు సమాచారమిచ్చామని వెల్లడించారు. వారు ఇక్కడికి వస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశముందన్నారు.

నృసింహాలయంలో 'రాయల' శాసనాలు



న్యాయవాదికి శాసనాలను చూపిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

కదిరి టౌన్: విజయనగర సామ్రాజ్యాధీశుడు హరిహర బుక్కరాయల కాలం నాటి సంస్కృత శాసనాలను కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కనుగొన్నట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. శాసనాల సంరక్షణలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖులు, న్యాయవాది సుబ్బరాజు గుప్తా తదితరులతో కలిసి మైనాస్వామి నృసింహాలయంలో పలు శాసనాలను పరిశీలించారు. తూర్పు, పడమర రాజగోపురం ద్వారాల్లో, గుడి దక్షిణ గోడ, తూర్పు ప్రాకారంపై శాసనాల ఆనవాళ్లను గుర్తించారు. ఆలయం వెలుపల, లోపలి గోడలను శుభ్రం చేసేటపుడు శాసనాలను చెరిపి వేస్తున్నారని చరిత్రకారుడు మైనా స్వామి ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రాశస్త్యాన్ని తెలిపే సామాన్యశకం 1352 నాటి మొదటి బుక్కరాయల శాసనాన్ని మైనాస్వామి చూపించారు. శాసనాన్ని బట్టి ఆలయ నిర్మాణం ప్రధాన గోపురం అప్పటికే పూర్తి అయి ఉండవచ్చన్నారు. రెండో హరిహర రాయలు, ఆయన కుమారుడు ఒకటో దేవరాయలు, విరూపాక్ష రాయలు, శ్రీకృష్ణదేవ రాయలు తదితరుల శాసనాలను సంరక్షించుకోవాలని మైనా స్వామి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో యువకుడి గల్లంతు



యువకుడి కోసం గాలిస్తున్న పోలీసులు

కనగానపల్లి: హంద్రీ-నీవా కాలువలో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రమేష్ (30) తన బంధువుల పిల్లలతో కలసి బుధవారం సాయంత్రం హంద్రీ-నీవా కాలువ వద్దకు వెళ్లాడు. గట్టుపై నిలబడి నీటిని పరిశీలిస్తున్న ప్రవీణ్ అనే బాలుడు ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడ్డాడు. విషయాన్ని గమనించిన రమేష్ వెంటనే కాలువలో దూకి బాలుడిని కాపాడి, ఇతరుల సాయంతో గట్టుకు చేర్చాడు. అయితే నీటి ప్రవాహ వేగానికి ఆయన బయటకు రాలేక కొట్టుకుపోయాడు. విషయం తెలిసిన వెంటనే కనగానపల్లి పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని రాత్రి 8 గంటల వరకూ గాలింపు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు ప్రక్రియను గురువారానికి వాయిదా వేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని సంగీతంపల్లి శివారులో 480 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బలరామయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి పుట్టగోసులపల్లికి చెందిన అమరేష్‌ను అరెస్ట్ చేసి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్లలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని (ఎఫ్‌డీసీ) డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఎఫ్‌డీసీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీపై ఆరా తీశారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్, డాక్టర్ దిలీప్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతిజయ దుర్గ, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఎఫ్‌డీసీ డీఈఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్ హరి



కుప్పకూలిన పోస్టల్ ఉద్యోగి పెద్దన్న

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి డూపులేట్ వంక వద్ద బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో త్రుటిలో ప్రాణాలతో ఇద్దరు బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు... బత్తలపల్లి వైపు నుంచి బెంగళూరుకు దోసకాయలను తరలిస్తున్న అశోక లేలాండ్ మినీ లారీ డూపులేట్ వంక వద్దకు చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యర్రాయపల్లికి చెందిన పోస్టల్ ఉద్యోగి పెద్దన్నను డ్రైవర్ తప్పించబోయి సడన్‌గా బ్రేక్‌లు వేశాడు. ఆ సమయంలో మినీ లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన డ్రైవర్ హరి, పెద్దన్న స్వల్పగాయాలతో బయటపడ్డారు. దొమ్మల్లో నొప్పి అంటూ బాధపడుతున్న పెద్దన్నను హోంగార్డు బాలు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మినీలారీ బోల్తాపడడంతో దోస కాయలు రోడ్డు పాలయ్యాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు కొన్ని చేతబట్టుకుని పోయారు. మరికొన్ని వాహనాల కింద పడి ఛగిలిపోయాయి. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో మినీ లారీని రోడ్డు పక్కకు తొలగించారు.

జాతీయ స్థాయి పోటీలకు బుక్కపట్నం విద్యార్థి



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.సుభాష్ జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కర్నూలులో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న సుభాష్.. 96 కేజీల విభాగంలో 103 కిలోల బరువును ఎత్తి బంగారు పతాకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ నెల 12, బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. దీంతో సుభాష్‌ను బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్, పీడీ నాగరాజు అభినందించారు.